# నిప్పు కురిసిన క్షణం

'కిక్ వచ్చే సంఘటనలు నెరేట్' చెయ్యడంలో మామయ్యకు సాటి నాకు తెలిసిన వాళ్లెవరూ లేరు. అసలు మామయ్య మామూలు మనిషి కాదు. ఒక ఫినామినన్. వారాని కో రోజైనా మావయ్య దగ్గర కెళ్లి ఒక గంట కూచుని రాకపోతే ఏదోలా ఉంటుంది. నేను నిన్న వెళ్లేసరికి మామయ్య ఇంట్లో ఎవరూ లేరు. ఒక్కడూ కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు.

'' వెళ్లి డ్రింకు తెచ్చుకోరా '' అన్నాడు నన్ను చూసి. ఫ్రిజ్‌లోంచి ఒక ఫాంటా తీసుకుని ఎదురుగా వెళ్లి కూచున్నాను.

'' నీకు కాబట్టి ఇలా చెబుతున్నాను. నీకు ఇష్టమైన స్వీటు తింటున్నావనుకో. చివరకు వచ్చేస్తూంది చేతిలోని ముక్క. చిన్న చిన్న పిసర్లు కొరుకుతూ నాలిక మీద నాన్చుతూ, ఆ ఆనందాన్ని ఇంకా, ఇంకా అలా చాలా సేపు అనుభవించాలని అనుకుంటావ్.''

నాకు పాతికేళ్లొచ్చినా మామయ్యకు నేను చంటి వాణ్ణే. చిన్న ఉపన్యాసం, అదిలోనే స్వీటు ఉపమానం. నన్ను మామయ్య చంటివాడిని చేస్తున్నందుకు నాకు చిరుకోపం వచ్చింది.

'' విస్కీ తాగుతున్నట్టు చుక్కాచుక్కా అటు రుచీ, ఇటు తావీ ఆస్వాదిస్తూ, గుడ్లు మిటకరిస్తూ గుక్కలు వెయ్యాలంటావ్ – అంతేనా ?''

మామయ్యను షాక్ చెయ్యాలని నా ఉద్దేశ్యం.

'' కుర్రకుంకా ! విస్కీ గురించి నువ్వు మాట్లాడడం విడ్డూరం. మీ నాన్న వింటే నిజంగా నేను నీకు మప్పేననుకుంటాడు.... తరువాత నువ్వు నా ఎదుట, విస్కీ గురించి... ఇన్ క్రెడిబుల్... ఇరవై నాలుగు ఇంపోర్టెడ్ బ్రాండ్ల విస్కీని కళ్లు మూసుకుని రెండో గుటకలో పోల్చుకున్నాను. ఒక సారి పందెం కట్టి – కాని అది అప్రస్తుతం.''

'' మరి ప్రస్తుతం ఏమిటి మామయ్యా ?''

'' నే చదువుతున్న పుస్తకం.''

తెరచి బోరగిల్లా పడుకో పెట్టబడిన పుస్తకం అట్ట చూశాడు. ఆంగ్ల వ్యాస సంపుటి.

'' దీనిలో అంత 'కిక్' వచ్చే ఘట్టమేమిటి, మామయ్యా ?'' నిజంగా డిసైపుల్ మొహం వేసి అడిగాను.

'' ఒరేయ్, చిట్టిగా ! నవలేమిటి, నాటకమేమిటి, కథేమిటి, వ్యాస మేమిటి, రాసే వాడిలో చేవ ఉంటే ప్రతి పేజీ, ప్రతివ్యాసం మధు బిందువులా, మనపైన జవ్వని చిరునవ్వులా హాయిగా ఉంటుంది. ఉదాహరణకిది చూడు.'' పుస్తకం ఎత్తి తను చదువుతున్న పేజీ లోంచి ఒక వ్యాసం బయటకు చదవి వినిపించాడు. దాని అనువాదం – '' మనం రక్షించబడ్డమేనా, నరకాని కి పోవడమైనా మన చేష్టల వల్ల కాదు జరిగేది, మన ఆలోచన వల్ల.''

''మామయ్య ముఖం ఆలోచనతో నిండి ఉంది. స్వర్గం, నరకం మన చేష్టల వల్ల కాదు సంక్రమించేవి –– మననం చేసుకోవడానికి మంచి ఆలోచనే.

'' నరక మంటే నీకు నమ్మకం ఉందా ?'' మామయ్య నన్ను అడిగాడు.

'' లేదు.''

" పొరపాటు. కుర్రవాడివి – నిన్ను అలాటి ప్రశ్న అడగడం... స్వర్గం నరకం అంటే ఏమిటో చెబుతాను. వింటావా ?''

సోఫాలోంచి లేచి పుస్తకం జాగ్రత్తగా మడిచి అల్మైరాలో పెట్టి సిగరెట్టు తీసి వెలిగించాడు.

మామయ్య పుస్తకం మడవడం చూస్తే పక్షిని మచ్చిక చేసినట్టు కనబడుతుంది. 'ఏదైనా హేండ్లింగ్‌లో ఉంటుందిరా' అంటూ ఉంటాడు. సార్థకంగా నవ్వుతూ, మామయ్యని ఎరిగిన ఆడవాళ్లు మామయ్య వదిలేస్తే పోయారు తప్ప, ఏ ఆడదీ మామయ్యని వదులుకోవాలనుకోదు. ఇది మామయ్య అన్న మాట కాదు. మామయ్య అంతరంగికులు చెప్పిన మాట. మామయ్య ఏదో సంఘటన చెప్పటానికి ఉపోద్ఘాతం ఇచ్చాడన్నమాట. నేను ఆత్రంగా వింటున్నాను.

" పార్వతిని నువ్వు ఎరగవ్... సుమారు ఇప్పుడున్న వయసులో నేనున్నప్పుడు జరిగిన..... ముచ్చటా ?''

" సాంతం విని అది నువ్వే చెబుదువ్ కాని, మధ్యలో ప్రశ్నలు వెయ్యకు. కన్‌ఫ్యూజన్ నీ బాధ్యత.''

–" శేషావతారం గారూ !'' బయట నుంచి పిలుపు. మామయ్య లేచి తలుపు దగ్గరకు వెళ్ళాడు.

ట్యూబ్‌లైట్ వెలుతుర్లో సిల్కులాల్చీ ధగధగలాడింది. ' మామయ్యకి బతకడమంటే ఏమిటో తెలుసు.' ఈ మాట అమ్మతో నేనంటుంటే నాన్నగారు విని నా మీద మండి పడ్డారు.

" ఆ వెధవ దగ్గర కెళ్లకు, వాడు నిన్నూ చెడగొట్టేస్తాడు. ఇప్పుడు ఆ నర్సు ముండ వాడి దగ్గరే ఉంటుందట కదూ?''

అవును, మామయ్య మళ్లీ బండి మార్చేశాడు – విన్నాను కాని, నాన్నగారి దగ్గరకాదు, నాన్నగారి చివరి వాక్యం గది బయటనుంచే విన్నాను.

మామయ్య విజిటర్ని అటునుంచి అటే పంపించి లోపలికొచ్చాడు.

" ఏం చెబుతున్నానూ?''

" పార్వతి ....

" రైట్, రైట్ అప్పటికి పార్వతికి ఇరవై ఏళ్లుంటా యేమో ! మేలిమి బంగారం బొమ్మ. అంత అందమైన ఆడదాన్ని అప్పటి నుంచి ఇప్పటి వరకూ నే చూడలేదు. ఎవరినైనా ఎదిరించే చిరునవ్వు. మంచి హుందా, బంగారానికి వెలిగారం అద్దినట్టు అహంకారం.''

అహంకారం అంటే గుర్తొచ్చింది. కొంత మంది స్త్రీలలో కొట్టవచ్చినట్టు కనపడేది ఈ అహంకారమే నీతో నాకేం ప్రమేయం ? నాకు కావలసినవన్నీ ఉన్నాయ్. వయస్సు, డబ్బు, అందం, జతగాడు.... నువ్వేమిటి బోడి బ్రహ్మచారివి... నా అహంకారానికి ఆజ్యం నీ చూపు ... ఇలా ఉంటుంది వాళ్లు మన వంక చూడకుండా వేసిన తూపు.

" ఇంతకీ పార్వతి ?'' ఆలోచనలోంచి ప్రస్తుతం లోకి వచ్చి మామయ్యనడిగాను.

" క్రింద పోర్షన్‌లో ఉండేవాళ్లు . కొత్తగా పెళ్లి అయిన జంట. భర్తకి బాంకులో ఉద్యోగం, కాంపోజిట్ స్టేట్ రోజులు. మద్రాసు నుంచి వచ్చారు. మేడమీద నుంచి క్రింద బాత్‌రూమ్ కనబడుతుంది. వాళ్లు ఆ పోర్షన్లో దిగిన దగ్గర్నుంచి నాకు మనసు మనసులో ఉండేదికాదు. కాళ్ళూ, కళ్లూ అటే లాగుతూ ఉండేవి.... బాత్‌రూమ్‌కి అప్పుడు పై టాప్ లేదు. మేడమీద

అలికిడి లేదని కాబోలు ధైర్యంగా ... ఒళ్లంతా కళ్లు చేసుకు చూస్తున్నాను. బోట్టిసెల్లి వీనస్ దంతంలో సాక్షాత్కరిస్తే ఎలా ఉంటుంది. నాకు గుండెలు దడదడలాడుతున్నాయ్. కళ్లు మత్తుతో బరువెక్కుతున్నాయ్. నా చూపుల వాడి వెన్నులో గుచ్చుకున్నట్టు చటుక్కున తల ఎత్తి కిటికీ వంక చూసింది... కంగారుగా గుండెల మీద చేతులు కప్పుకోలేదు పార్వతి. ఆవిడ ముఖంలో భావాన్ని ఆ స్థితిలో ఎవరు అర్థం చేసుకోగలరు ! కిందకు రమ్మని సైగ చేసింది.... కాళ్లు లొటలొట లాడుతుండగా వింత కోరిక ముమ్మరంలో నాలిక తడి ఆరిపోతుండగా మూడేసి మెట్లు చొప్పున దిగి బాత్ రూం వరకు వెళ్లాను. తలుపు చేరవేసి ఉంది.

'' ప్లీజ్! పాలు పొంగుకు వచ్చినట్లున్నాయ్, వెళ్లి దించి వస్తారా ?''

'' ఓయస్. '' ఒక్క ఉదుటన వాళ్ల వంటింట్లోకి వెళ్లాను. ఆరకాగిన పాలు పొంగలేదు కాని ఎర్రగా మీగడ కట్టి ఉన్నాయ్. షర్ట్ టెయిల్‌తో దింపబోయాను. చెయ్యి చురుక్కుమంది. వేలు నోట్లో పెట్టుకొని బయటకు తీసి వూదుకుంటున్నాను.

తడిజుట్టుతో, చీర గుండెల మీదకు చుట్టుకుని, కలవల రాణిలా పార్వతి హుందాగా నవ్వుతోంది నన్ను చూసి, '' భలేవారే , చెయ్యి చురక పెట్టుకున్నారు ! రండి లోపలకు.''

– ఈ మాట విన్నాడేమో, ఆవిడ భర్త మెల్లగా బయటకు వచ్చాడు. ఆరడుగుల మనిషిని, అరంగుళానికి కుదించుకుపోయేను.

'' రండి, రండి '' ఆహ్వానించాడాయన.

'' అబ్బే, అక్కర్లేదు, నే వెడతా !''

'' పాలు పొంగుతాయేమో – మీరు నీరసంగా ఉన్నారని – అరెరె కాఫీ తాగకుండానే వెళ్లిపోతున్నాడే అల్ప్రిష్టి.....'' నేను బయటకు వచ్చేస్తూ విన్నాను.''

'' ఆడదానికి ఎంత అహంకారం !'' నేను ఉండబట్టలేకపోయాను.

'' కాదురా, ఆత్మ విశ్వాసం. నాకు నరకాన్ని పరోక్షంగా చూపించాలని నిశ్చయం. ఆ క్షణంలో నరకంలోని నిప్పులు నా మనసులో కురిశాయి. నేను మళ్లీ ఆమె ఎదుట తల ఎత్తలేదు....''

మామయ్య నిట్టూర్చాడు.

నేనూ నిట్టూర్చాను, ఆశాభంగంతో.

**ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక**

1-8-79